క్లుప్తంగా

కోడూరులో భారీ వర్షం



కోడూరు: కోడూరు, చుట్టు పక్కల గ్రామాల్లో సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. మంగళవారం మధ్యాహ్నం వరకు ఓ మోస్తారు వర్షం కురుస్తూనే ఉంది. వర్షం ప్రభావంతో లోతట్టు ప్రాంతాలు జలమయం కావడంతో పల్లపు ప్రాంతాల్లోకి వర్షం నీరు చేరింది. వీవర్స్ కాలనీ, అంబటి బ్రహ్మణయ్య కాలనీ, మెరక గౌడపాలెం, ఇస్మాయిల్‌బేగ్ పేట గ్రామాల్లో రహదారిపై నీరు నిలిచింది. వాతావరణం చల్లబడటంతో పాటు మరో రెండు రోజుల పాటు వర్షాలు ఉంటాయని వాతావరణ శాఖ ప్రకటనల నేపథ్యంలో రైతులు వ్యవసాయ పనులకు సమాయత్తమయ్యారు.

చిన్నాపురం పీహెచ్‌సీ సందర్శన



కోనేరుసెంటర్: చిన్నాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌ఓ గీతాబాయి మంగళవారం సందర్శించారు. ఆశా డే సందర్భంగా పీహెచ్‌సీని సందర్శించి వసతులను పరిశీలించారు. సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. మందుల లభ్యత, రోగులకు అవసరమైన సదుపాయాలు ఆసుపత్రిలో ఉన్నదీ లేనిదీ అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో సిబ్బంది చేపట్టే ఆరోగ్య కార్యక్రమాల గురించి పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ నాగనిఖిలను అడిగి తెలుసుకున్నారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు.

అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం



మచిలీపట్నంటౌన్: దళిత జేఏసీ ఆధ్వర్యంలో లక్ష్మీటాకీసు సెంటర్‌లోని బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి మంగళవారం రాత్రి క్షీరాభిషేకం చేశారు. శారదా నగర్‌లోని అంబేడ్కర్ విగ్రహంపై చెప్పులు, రాళ్లు విసిరిన నిందితులను అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. మచిలీపట్నంలో దళితులపై ఇటీవల జరుగుతున్న దాడులను పూర్తిస్థాయిలో నివారించాలని, లేకుంటే ఆందోళనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. దళిత జేఏసీ జిల్లా అధ్యక్షుడు జక్కుల ఆనందబాబు, కార్యదర్శి బేతపూడి రవి, దళిత జేఏసీ నాయకులు బందెల థామస్ నోబుల్, మాచవరపు రాంప్రసాద్, యంద్రపాటి నాగేశ్వరరావు, బూరగ రామారావు, కొడాలి శర్మ, పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వినతి



గూడూరు: గూడూరులో దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న స్థలాల రిజిస్ట్రేషన్ సమస్య పరిష్కారానికి చొరవ తీసుకోవాలని గూడూరు మండల ప్రజాప్రతినిధులు మైనార్టీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి ఏఎండీ ఇంతియాజ్‌కు విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆయన కార్యాలయంలో ఇంతియాజ్‌ను ఎంపీపీ సంగా మధుసూదనరావు, జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబు తదితరులు కలిశారు. గత ఆరేళ్లుగా స్థలాల రిజిస్ట్రేషన్లు నిలిచిపోయి గూడూరు గ్రామ ప్రజలు పడుతున్న ఇబ్బందులను వివరించారు. వక్ఫ్ బోర్డు ద్వారా ఎన్‌ఓసీ జారీ చేస్తే సమస్య పరిష్కారం అవుతుందని వివరించారు. ఇంతియాజ్ మాట్లాడుతూ మంత్రి జోగి రమేష్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఇప్పటికే తమను ఆదేశించారని వివరించారు. త్వరలోనే సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు గొరిపర్తి రవికుమార్, మోటే పల్లి రత్నారావు, తలుపుల వెంకట కష్ణారావు, లింగం విజయకుమార్, బత్తిన త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

బందరులో 98.34 శాతం పింఛన్ల పంపిణీ

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం నగర పాలక సంస్థ పరిధిలో నాలుగో రోజైన మంగళవారం వైఎస్సార్ సామాజిక పింఛన్ల పంపిణీ 98.34 శాతం పూర్తి చేశారు. నగరంలో 18,460 పింఛన్లు ఉండగా వీటిలో 18,153 పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు. మిగిలిన పింఛన్లను బుధవారం పంపిణీ చేసేందుకు కృషి చేస్తున్నామని కమిషనర్ చంద్రయ్య తెలిపారు.

జగనన్న సురక్షతో అందరికీ మేలు

- ప్రజలకు చేరువైన సేవలు
- జగన్ పాలనను మరోసారి కోరుకుంటున్న ప్రజలు
- అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు



మంగళాపురం సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు



కాకర్లమూడిలో ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న అధికారులు



బందరులో ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న పేర్ని కిట్టు తదితరులు

మంగళాపురం(చల్లపల్లి): ఇప్పటివరకు ఏ పథకం పొందని అర్హత ఉన్న వారిని గుర్తించి వారికి పథకాలు అందించడంతోపాటు 11 రకాల సేవలను ఉచితంగా జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అందజేస్తున్నారని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అమలు చేస్తున్న అద్భుతమైన సంక్షేమ పథకాలతో ఆర్థికంగా బలోపేతం అవుతున్న పేదలు మరోసారి వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనను కోరుకుంటున్నారని చెప్పారు. స్థానిక గ్రామ సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం మంగళవారం జరిగింది. గ్రామస్తులు 11 రకాల సర్టిఫికెట్లకు 415 దరఖాస్తులు సమర్పించగా ఎమ్మెల్యే రమేష్‌బాబు ముఖ్య అతిథిగా విచ్చేసి ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న సురక్ష తరహా అత్యంత ప్రయోజనకరమైన కార్యక్రమం దేశంలో మరెక్కడా అమలులో లేదన్నారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు సులభంగా అందించడంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ఆదర్శంగా నిలుస్తోందని చెప్పారు. ఎలాంటి సిఫార్సులతో పని లేకుండా సంక్షేమ పథకాలు పేదల గడప వద్దకే అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని అన్నారు. సంక్షేమ పాలన చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయనీ, వారి మాటలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే మరోసారి ఈ రాష్ట్రంలో ఏర్పడుతుందని తెలిపారు. సర్పంచ్ డొక్కు నాగేశ్వరరావు, ఎంపీడీఓ సీహెచ్ చినరాట్నాలు, వైస్ ఎంపీపీ వెంకటేశ్వరమ్మ, పీఏసీఎస్ చైర్మన్ పేరం నాగిరెడ్డి, పంచాయతీ ఈఓ బీవీ సుబ్బారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి..

వక్కలగడ్డ(చల్లపల్లి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. మంగళవారం వక్కలగడ్డ గ్రామ సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహణపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే సింహాద్రి మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన 11 రకాల సేవలు ఉచితంగా అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ పథకానికి శ్రీకారం చుట్టారని చెప్పారు. ప్రతి వలంటీర్ తమ పరిధిలోని కుటుంబాల వారిని కలిసి వారికి అవసరమైన సర్టిఫికెట్లకు తగిన ఆధారాలతో దరఖాస్తులు చేయించాలని సూచించారు. సర్పంచ్ వల్లూరు ఉమా, పీఏసీఎస్ చైర్మన్ బెనర్జీ, జేసీఎస్ కన్వీనర్ యడ్ల జగదీష్, పురిటిగడ్డ సర్పంచ్ మాతంగి రమ్య, ఏఎంసీ డైరెక్టర్ మోతుకూరి కొండలు తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు మేలు..

కోడూరు: జగనన్న సురక్ష కార్యక్రమంతో అర్హులందరికీ మేలు జరుగుతుందని డీఎఫ్‌ఓ, మండల ప్రత్యేకాధికారి రాజశేఖర్ అన్నారు. మంగళవారం మండలంలోని పిట్టల్లంక సచివాలయం వద్ద జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరిగే పని లేకుండా వలంటీర్లే ఇళ్లకు వచ్చి యాప్ ద్వారా లబ్ధిదారుడికి అవసరమైన సేవలను నమోదు చేస్తారని, గతంలో పరిష్కారం కాని వాటిని కూడా మరోసారి పరిశీలించి అర్హత ఉంటే వెంటనే సర్టిఫికెట్‌ను అందిస్తారని వివరించారు. అనంతరం సర్టిఫికెట్లను జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ, ఎంపీపీ కొండవీటి వెంకటకుమారి చేతుల మీదగా లబ్ధిదారులకు అందించారు. ఎంపీడీఓ పాండురంగారావు, తహసీల్దార్ షేక్ లతీఫ్‌పాషా, ఈఓపీఆర్డీ నాగరేవతి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పరిశె మాధవరావు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరిస్తున్న ప్రభుత్వం..

మచిలీపట్నంటౌన్: ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రణాళికాబద్ధంగా పనిచేస్తున్నారని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. నగరంలోని 4, 5, 6, 7, 8, 9 డివిజన్లలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు పలు రకాల ధ్రువీకరణ పత్రాలను డెప్యూటీ మేయర్ తంటిపూడి కవిత, కమిషనర్ జి. చంద్రయ్యలతో కలిసి అందజేశారు. కార్యక్రమంలో ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, లబ్ధిదారులు, అధికారులు పాల్గొన్నారు.

● కృత్తివెన్ను: జగనన్న సురక్ష పథకం ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందని ఎంపీడీఓ పిచ్చిబాబు, తహసీల్దార్ రామకోటేశ్వరరావు అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం మంగళవారం చినగొల్లపాలెం -2 సచివాలయం వద్ద తహసీల్దార్, చినపాండ్రాక-2 వద్ద ఎంపీడీఓ బృందాలు నిర్వహించాయి. చినపాండ్రాకలో 459, చినగొల్లపాలెంలో 142 వివిధ రకాల సర్టిఫికెట్‌లను లబ్ధిదారులకు ఉచితంగా అందించారు. డీటీ శశికుమార్, సర్పంచ్‌లు కె. బాయమ్మ, సునీల్, పంచాయతీ కార్యదర్శి ఉమామహేశ్వరి, సచివాలయ, పంచాయతీ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వారం ముందు సర్వే..

పెడన: జగనన్న సురక్ష క్యాంపు నిర్వహించే సచివాలయాల పరిధిలో వారం రోజుల ముందుగా ఇంటింటి సర్వే నిర్వహించి ఎవరికి ఏఏ ధ్రువీకరణ పత్రాలు కావాలో వలంటీర్లు నమోదు చేసుకుని క్యాంపులో ఇస్తారని తహసీల్దార్ పి. మధుసూదనరావు అన్నారు. మంగళవారం కాకర్లమూడి గ్రామంలో జగనన్న సురక్ష క్యాంపు నిర్వహించారు. ఎంపీడీఓ వి. రెడ్డయ్య మాట్లాడుతూ కాకర్లమూడి గ్రామ సచివాలయం పరిధిలో 156 ధ్రువీకరణ పత్రాలను అందించామన్నారు. ఈఓపీఆర్డీ ఎం. జయరాము, వైఎస్సార్ సీపీ గ్రామ ఇన్‌చార్జి పెద్ది ప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.

● గూడూరు: కోకనారాయణపాలెం గ్రామ సచివాలయంలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. సచివాలయం పరిధిలోని కోకనారాయణపాలెం, నారికేడలపాలెం గ్రామాల్లో అర్హులైన 457 మందికి వివిధ ధ్రువీకరణ పత్రాలు అందజేశామని తహసీల్దార్ బి.విజయ ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ డి.సుబ్బారావు , స్థానిక ప్రజాప్రతినిధులు కోళ్ల లక్ష్మణరావు, కె. నాగేశ్వరరావు, జంపాన రమాదేవి, కొల్లు సాంబశివరావు, సురేష్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారం కోసమే..

కోనేరుసెంటర్: ప్రజా సమస్యల పరిష్కారం కోసమే జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నామని బందరు ఆర్డీఓ ఐ. కిషోర్ అన్నారు. పెదపట్నం, గుండుపాలెం సచివాలయాల్లో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. పెదపట్నంలో జరిగిన కార్యక్రమంలో ఆర్డీఓ మాట్లాడారు. గుండుపాలెంలో జరిగిన కార్యక్రమంలో బందరు తహసీల్దార్ ఎం. శ్రీవిద్య మాట్లాడారు.

పెదపట్నంలో 84 అర్జీలు అందగా 74 ధ్రువీకరణ పత్రాలను అధికారులు అందజేశారు. గుండుపాలెంలో కార్యక్రమంలో 132 ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. పెదపట్నం సర్పంచ్ గడిదేశి అనూష, గ్రామ ఇన్‌చార్జ్ గడిదేశి రాజు, గుండుపాలెం సర్పంచ్ తూమాటి శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ తిరుమలశెట్టి ఏడుకొండలు, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ గడిదేశి బాలజేసు, డెప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్తులపై పర్యవేక్షణ

కలెక్టర్ రాజాబాబు

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో ప్రభుత్వ ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా బాధ్యతతో పర్యవేక్షించాలని కలెక్టర్ పి. రాజాబాబు అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం ఆయన అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని కొన్ని మండలాల్లో ప్రభుత్వ భూములు, ఆస్తులు అన్యాక్రాంతం అవుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయన్నారు. వాటిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందని చెప్పారు. ఎక్కడైనా ప్రభుత్వ స్థలాలు, భవనాలు దురాక్రమణకు గురైతే సంబంధిత అధికారులు నియంత్రణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. టెలీ కాన్ఫరెన్స్‌లో జేసీ అపరాజితసింగ్, డీఆర్వో ఎం. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

డెంగీపై అవగాహన ర్యాలీ

మొవ్వ: ఏ రకమైన జ్వరం వచ్చినా పీహెచ్‌సీలో వైద్య చేయించుకోవాలని వైద్యాధికారులు డాక్టర్ ఎం.వేదరాజ్, డాక్టర్ సీహెచ్ రాజేశ్వరి సూచించారు. మొవ్వ గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో డెంగీ వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం అవగాహన ర్యాలీని నిర్వహించారు. నివాస పరిసర ప్రాంతాల్లో నీరు నిలువ లేకుండా చేసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు. సీహెచ్‌వో శంకరరావు, విజయ్ కమార్, విజయదుర్గ, విజయకుమారి, లక్ష్మి, రామాంజనేయులు, ఆశావర్కర్‌లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

పేదల పెన్నిధి వంగవీటి రంగా



పెడన వైఎస్సార్ సీపీ కార్యాలయంలో రంగా చిత్రపటం వద్ద నాయకుల నివాళి



అవనిగడ్డలో రంగా, అల్లూరి చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి, నాయకులు



బందరులో నివాళులర్పిస్తున్న పేర్ని కిట్టు, వైఎస్సార్ సీపీ నాయకులు

అవనిగడ్డ/పెడన: పేదల పెన్నిధిగా వంగవీటి రంగా నిలిచారని, పేదవాడు ఎప్పుడు సాయం కోసం వచ్చినా అండగా ఉండేవారని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, పలువురు వక్తలు అన్నారు. వంగవీటి మోహనరంగా జయంతి కార్యక్రమం అవనిగడ్డ, పెడన, మచిలీపట్నం నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల్లో మంగళవారం నిర్వహించారు. అవనిగడ్డ వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద రంగా చిత్రపటానికి ఎమ్మెల్యే సింహాద్రి, నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పీడితులు, పేదల అభ్యున్నతికి, వారి సమస్యల పరిష్కారానికి రంగా ఎంతగానో కృషి చేశారని కొనియాడారు. పలువురు నాయకులు పాల్గొన్నారు. పెడన పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో రంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ బండారు మల్లికార్జునరావు, మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్ ఎండీ ఖాజా, మండల కన్వీనర్ కొండవీటి నాగబాబు, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ బళ్ల గంగయ్య, మైనార్టీ జిల్లా నాయకుడు అయూబ్ ఖాన్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

● కృత్తివెన్ను: రంగా జయంతి వేడుకలను మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. గాంధీనగరం, చినపాండ్రాక, నీలిపూడి, లక్ష్మీపురం, చందాల, పోడు తదితర గ్రామాలలో రంగా విగ్రహాలకు అభిమానులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రంగా ఆశయాలను సాధించుకుంటామని యువత నినాదాలు చేశారు. పెద్ద సంఖ్యలో రంగా అభిమానులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

● కోసూరువారిపాలెం(మోపిదేవి): మండలంలోని పలు గ్రామాల్లో రంగా జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. కోసూరువారిపాలెంలో రంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. సర్పంచ్ కోసూరు అనూష, ఎంపీటీసీ సభ్యులు సనకా వెంకట రాజేష్‌బాబు, సచివాలయాల మండల కన్వీనర్ కోసూరు శివనాగ మల్లేశ్వరరావు, సనకా నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బందరులో..

మచిలీపట్నంటౌన్: చిలకలపూడి ఐదుగుళ్ల సెంటర్‌లోని రంగా విగ్రహానికి వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) పూలమాల వేసి నివాళులర్పించారు. అక్కడే ఉన్న రాజీవ్‌గాంధీ, చిలంకుర్తి అబ్బులు విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. కిట్టు మాట్లాడుతూ రంగా ఏ మతానికో, కులానికో చెందినవాడు కాదన్నారు. అన్నివర్గాల ప్రజల గుండెల్లో ఆయన చిరస్థాయిగా నిలుస్తారని చెప్పారు. డెప్యూటీ మేయర్ లంకా సూరిబాబు, పలువురు కార్పొరేటర్లు, పార్టీ ఇన్‌చార్జీలు పాల్గొన్నారు. రాధా రంగా మిత్రమండలి ఆధ్వర్యంలో రేవతి సెంటర్‌లోని రంగా విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించి కేక్ కట్ చేశారు. రాధా రంగా మిత్రమండలి జిల్లా అధ్యక్షుడు ధర్మారావు తదితరులు పాల్గొన్నారు. నగరంలోని చింతగుంటపాలెం, శారదా నగర్, రాజుపేట, నిజాంపేట, బలరామునిపేట తదితర ప్రాంతాల్లోని రంగా విగ్రహాలకు ఆయా ప్రాంతాల్లోని ప్రజలు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఘనంగా రంగా జయంతి వేడుకలు..

గూడూరు: గూడూరులో ఎంపీపీ సంగా మధుసూదనరావు కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. జెడ్పీటీసీ సభ్యులు వేముల సురేష్ రంగబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు గురిపర్తి రవికుమార్, మోటేపల్లి రత్నారావు, తలుపుల వెంకట కృష్ణారావు, కోళ్ల బాలకృష్ణ, లింగం విజయ్ కుమార్, బత్తిన త్రినాథ్ పాల్గొన్నారు. అనంతరం వృద్ధాశ్రమంలో వద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. తరకటూరులో ఎంపీటీసీ సభ్యుడు జక్కా ధర్మారాయుడు ఆధ్వర్యంలో రంగా జయంతి వేడుకలు నిర్వహించారు

మహనీయుల ఆశయాలు ఆదర్శనీయం

ఎమ్మెల్యే సింహాద్రి



వివేకానంద, పింగళి చిత్రపటాలవద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే, నాయకులు



పెడన ఎంపీడీఓ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న కార్యాలయ సిబ్బంది

అవనిగడ్డ: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు, జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య, స్వామి వివేకానంద వర్ధంతి కార్యక్రమం అవనిగడ్డ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రంగా జయంతిని పురస్కరించుకుని కేక్ కట్ చేసి నాయకులు, అభిమానులకు అందజేశారు. ఎమ్మెల్యే సింహాద్రి మాట్లాడుతూ బ్రిటిష్ పాలకులను గడగడలాడించి తెలుగుజాతి పౌరుషాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన గొప్ప పోరాట యోధుడు అల్లూరి సీతారామరాజు అని అన్నారు. జాతీయ జెండాను రూపొందించడంతో పాటు బహుముఖ ప్రజ్ఞాశాలిగా కీర్తి గడించిన పింగళి వెంకయ్య జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని చెప్పారు. యువశక్తిని వినియోగించు కోవడంతో పాటు, యువత సన్మార్గంలో నడిచేందుకు స్వామి వివేకానంద బోధనలు ఎంతగానో దోహద పడతాయన్నారు. ఈ సందర్భంగా లంకమ్మ అమ్మవారి ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ అన్నపరెడ్డి రాందాస్ ఆర్థిక సహాయంతో స్థానిక ప్రభుత్వ ఏరియ వైద్యశాలలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల పార్టీ కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, మండల కో–ఆప్షన్ సభ్యులు షేక్ నజీర్‌బాషా, రాధా రంగా మిత్రమండలి దివి యూనిట్ అధ్యక్షుడు రాజనాల మాణిక్యాలరావు, ఎంపీటీసీ తోట గణేష్, అన్నపరెడ్డి వెంకటస్వామి పాల్గొన్నారు.

● కోడూరు: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను మండలాధికారులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. పిట్టల్లంక సచివాలయం వద్ద సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్య ఉద్యమంలో అల్లూరి పోరాటాన్ని మండల ప్రత్యేకాధికారి, డీఎఫ్‌ఓ రాజశేఖర్ గుర్తు చేశారు. జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ, ఎంపీపీ కొండవీటి వెంకటకుమారి, ఎంపీడీఓ పాండురంగారావు, ఈఓపీఆర్డీ నాగరేవతి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పరిశె మాధవరావు, జిల్లా రైతు విభాగం కార్యదర్శి వీరవెంకటనారాయణరావు పాల్గొన్నారు.

● పెదకళ్లేపల్లి (మోపిదేవి): జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. పెదకళ్లేపల్లిలోని ఆయన విగ్రహం వద్ద పింగళి సేవలను కొనియాడారు. సర్పంచ్ అరజా సంధ్యారాణి, ఎంపీటీసీ సభ్యురాలు అరజా ఆశాదేవి, అరజా కాంత్, కార్యదర్శి రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

● చల్లపల్లి: భారత జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య వర్ధంతి కార్యక్రమాలు మంగళవారం చల్లపల్లిలో ఘనంగా జరిగాయి. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పింగళి వెంకయ్య విగ్రహానికి తహసీల్దార్ కె.గోపాలకృష్ణ, ఈఓఆర్డీ బూరేపల్లి అశోక్, ఉప సర్పంచ్ ముమ్మనేని రాజకుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. డీటీ ఎస్ఎస్ఎస్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ ఘంటసాల కృష్ణమోహన్, మాజీ సర్పంచ్ పైడిపాముల వెంకటేశ్వరరావు, పలువురు అధికారులు పాల్గొన్నారు. చల్లపల్లి పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, ఈఓ పేర్ని మాధవేంద్రరావు, గ్రామ సచివాలయాల సిబ్బంది, వలంటీర్లు పింగళి వెంకయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

● మచిలీపట్నంటౌన్: మన్నెం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి కార్యక్రమం 38వ డివిజన్ సచివాలయంలో నిర్వహించారు. సీతారామరాజు చిత్రపటానికి వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జ్ శ్రీకాకోళపు నరసింహగుప్తా, అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ శ్రీకాకోళపు రేణుకారాణి పూలమాల వేసి నివాళులర్పించారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు. ఈడేపల్లి శాఖా గ్రంథాలయంలో అల్లూరి చిత్రపటానికి గ్రంథాలయ పాలకురాలు వెంకటేశ్వరమ్మ, పాఠకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● పెడన: పెడన ఎంపీడీఓ కార్యాలయంతో పాటు పట్టణంలోని బొడ్డు నాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల, గ్రామ సచివాలయాల్లో అల్లూరి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళలర్పించారు. కళాశాలలో విద్యార్థులకు ప్రిన్సిపాల్ కె. చంద్రశేఖరరామారావు విప్లవవీరుని జీవిత చరిత్రను, పోరాట పటిమను వివరించారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఏఓ బాలాజీతో పాటు ఉద్యోగులు పాల్గొన్నారు. కాకర్లమూడి జగనన్న సురక్ష క్యాంపులో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తహసీల్దార్ మధుసూదనరావు, ఎంపీడీఓ రెడ్డయ్య, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు. మండలంలోని నందమూరు, జింజేరు, చోడవరం, నడుపూరు, చేవేంద్ర గ్రామ సచివాలయాల్లో అల్లూరి జయంతి వేడుకలు నిర్వహించారు.


పేదలకు ప్రభుత్వం అండ



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి

మోపిదేవి: పేద వర్గాలకు అండగా ఉంటున్న జగనన్నను ప్రజలు మరోసారి దీవించాలని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. మోపిదేవి జెడ్పీపాఠశాల ఆవరణలో హెచ్‌ఎం జయంతి అధ్యక్షతన మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అమ్మ ఒడి చెక్కును అందజేశారు. నాలుగో విడత తల్లుల ఖాతాలో జమచేసిన రూ. 3,74,70,000 చెక్కు అందచేశారు. ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల్లో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చారన్నారు. ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టి కార్పొరేట్ పాఠశాలలకు అభివృద్ధి చేశారని వివరించారు. తొలుత విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మెరకనపల్లి గ్రామ సచివాలయం వద్ద మంగళవారం సర్పంచ్ యర్రంశెట్టి ధనరాజ్యలక్ష్మి అధ్యక్షతన జగనన్న సురక్ష శిబిరం నిర్వహించారు. ఎమ్మెల్యే రమేష్‌బాబు పాల్గొని 286 మంది లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందచేసి మాట్లాడారు. సర్పంచ్‌లు నందిగం మేరీరాణి, తుమ్మా సోములమ్మ, గరికిపాటి వెంకటేశ్వరరావు, ఎంపీటీసీలు సనాకా వెంకట రాజేష్‌బాబు, కారుమూరి శివనాగులు, రాజులపాటి నాగేశ్వరరావు, తహసీల్దార్ కె. నవీన్‌కుమార్, ఎంపీడీఓ రామలింగేశ్వరరావు, పీఏసీఎస్ చైర్‌పర్సన్‌లు, నాయకులు పాల్గొన్నారు.

జేవీకే కిట్ల పంపిణీకి బయోమెట్రిక్ తప్పనిసరి



పెడన: జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీకి సంబంధించి విద్యార్థులు లేదా వారి తల్లిదండ్రుల నుంచి తప్పనిసరిగా బయోమెట్రిక్ తీసుకోవాలని జగనన్న విద్యా కానుక-4 రాష్ట్ర పరిశీలకులు, సమగ్ర ఎంఐఎస్ కో–ఆర్డినేటర్ ఆర్. హైమేశ్వరరావు అన్నారు. మంగళవారం ఆయన బీజీకే జెడ్పీహెచ్‌ఎస్‌లో జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ తరువాత బయోమెట్రిక్ వివరాలను పరిశీలించి మాట్లాడారు. అనంతరం బ్రహ్మపురంలోని ప్రాథమిక పాఠశాలలో షూ స్టాక్ పాయింట్‌లో షూ, సాక్సుల కొలతలు పరిశీలించారు. సీఆర్పీలు పాల్గొన్నారు.

● బంటుమిల్లి: కంచడం, పెదతుమ్మిడి, సాతులూరు, చోరంపూడి, ఆముదాలపల్లి, చినతుమ్మిడి, మల్లేశ్వరం గ్రామాల్లో మంగళవారం నుంచి సోషల్ ఆడిట్ బృందం సభ్యులు పర్యటిస్తూ ఉపాధి హామీ పథకంలో చేసిన పనులను పరిశీలిస్తున్నారని ఏపీఓ ముత్యాలు తెలిపారు. ఈ గ్రామాల్లో పనుల పరిశీలన అనంతరం స్థానిక సచివాలయాల వద్ద గ్రామ సభలు ఈ నెల 7వ తేదీన జరుగుతాయని ఏపీఓ చెప్పారు.

వృద్ధురాలి పట్ల కలెక్టర్ ఔదార్యం



కలెక్టర్ రాజాబాబుకు సమస్యను వివరిస్తున్న మల్లమ్మ

చిలకలపూడి(మచిలీపట్నం): గూడూరు మండలం రామరాజుపాలెం గ్రామానికి చెందిన వృద్ధురాలి పట్ల కలెక్టర్ పి. రాజాబాబు ఔదార్యం చూపారు. ఆమె ఎదుర్కొంటున్న సమస్యను తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. వివరాల ప్రకారం.. గూడూరు మండలం రామరాజుపాలెంకు చెందిన దేసు మల్లమ్మ మాట్లాడుతూ తాను ఒంటరిగా ఉంటున్నానని, తన ఇంటి పక్కన నివాసం ఉంటున్న వారు తన స్థలంలోకి చొరబడి తాటాకు దడులను తొలగించి తనపై దాడి చేశారని కలెక్టర్‌కు చెప్పి బోరున విలపించింది. గొంతుపై కాలితో తొక్కి మరీ బెదిరించారని వివరించింది. తనకు ప్రాణరక్షణ కల్పించాలని, వారిపై చట్టరీత్యా తగిన చర్యలు తీసుకోవాలని వేడుకొంది. దీనిపై కలెక్టర్ రాజాబాబు స్పందిస్తూ ఆక్రమణకు పాల్పడిన, దాడి చేసిన వారిపై వెంటనే కేసు నమోదు చేయాలన్నారు. అలాగే మల్లమ్మకు రక్షణ కల్పించాలని ఆదేశించారు.